
www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 18 మార్చి 2023
5
వైఎస్ఆర్



ఆప్కోలో చేనేత వస్త్రాలపై గొప్ప ఆఫర్

ప్రజాశక్తి - కడప

ఉగాది, శ్రీరామనవమి పండుగ సందర్భంగా చేనేత వస్త్రాలపై గొప్ప ఆఫర్ ఇస్తున్నట్లు కడప ఆప్కో సహాయ వాణిజ్య మండల అధికారి ఎం. మధుబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ ఆప్కో చేనేత వస్త్రాలయం కడపలో బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ పక్కన, దిశా పోలీస్ స్టేషన్ ఎదురుగా చేనేత వస్త్ర విక్రయాలను ఉగాది శ్రీరామనవమి పండుగల సందర్భంగా క్లియరెన్స్ సేల్స్ కౌంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కౌంటర్లో నిలువ ఉన్న స్టాక్‌లపై కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు చేపట్టామన్నారు. మాధవరం, రాజమండ్రి, బందరు, వెంకటగిరి, చీరాల, ఉప్పాడ చీరలు, పొందూరు షర్టులు, పట్టు, కాటన్ దోవతులు, టవళ్లు కొనుగోలుచేసి చేనేత పరిశ్రమను, కార్మికులను ప్రోత్సహించాలన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా రామచంద్రారెడ్డి

- ఉత్కంఠ పోరులో స్వల్ప మెజార్టీతో గెలుపు
- ధ్రువీకరణ పత్రం అందజేసిన అనంత కలెక్టర్
- పట్టభద్ర ఓట్ల లెక్కింపుల్లో హోరాహోరీ



అనంతపురం కలెక్టర్ నాగలక్ష్మీ నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న ఎం.వి. రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎం.వి. రామచంద్రారెడ్డి గెలుపొందారు. రెండ్రోజులుగా అనంతపురం జెఎన్‌టియులో చేపట్టిన కౌంటింగ్‌లో తన సమీప ప్రత్యర్థి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి నుంచి ఎదురైన ఉత్కంఠ భరిత పోరులో 169 ఓట్ల స్వల్ప మెజార్టీతో బయటపడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 12 మంది అభ్యర్థులు నిలిచిన సంగతి తెలిసిందే. వీరిలో ఎం.వి.రామచంద్రారెడ్డి, ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, కత్తి నరసింహారెడ్డి మధ్య హోరాహోరీగా పోరు నడిచింది. వీరిలో ఎవరికీ 50 శాతం ఓట్లు లభించని నేపథ్యంలో ద్వితీయ ప్రాధాన్య ఓటును పరిగణలోకి తీసుకుని లెక్కించాల్సి వచ్చింది. పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 25,272 ఓట్లు పోలు కాగా, 3,867 చెల్లని ఓట్లుగా తేలినట్లు సమాచారం. 21,405 ఓట్లలో అధికార వైసిపి మద్దతుదారు ఎం.వి.రామచంద్రారెడ్డికి 10,787 ఓట్లు, ఒంటేరు శ్రీనివాసులరెడ్డికి 10,618 ఓట్లు లభించాయి. 169 స్వల్పఓట్ల మెజార్టీతో అధికార వైసిపి మద్దతుదారు ఎం.వి.రామచంద్రారెడ్డి గెలు పొందినట్లు ప్రకటించారు. అనంతపురం కలెక్టర్ నాగలక్ష్మీ ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల దగ్గర నుంచి ఎన్నికల ప్రచారం, కౌంటింగ్ దశల వరకు ప్రత్యర్థుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. నామినేషన్ల దాఖలు, స్క్రూటినీ, పరిశీలన, ఉపసంహరణ దశల అనంతరం హోరాహోరీగా తలపడాల్సి వచ్చి మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, అనిల్‌రెడ్డి తదితరుల నుంచి అనివార్యమైన పోరు ఎదురైంది. కౌంటింగ్ దశలో ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపులోనూ ఆధిక్యం చేతులు మారుతూ రావడం ఊపిరి బిగబట్టుకుని గెలుపు కోసం నిరీక్షించాల్సి వచ్చింది. పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ పది రౌండ్ల లెక్కింపులో భాగంగా ఇప్పటి వరకు లెక్కించిన ఆరు రౌండ్ల ఓట్ల లెక్కింపులోనూ అధికార వైసిపి మద్దతుదారు వెన్నపూస రవీంద్రారెడ్డి, టిడిపి మద్దతుదారు రామ్‌గోపాల్‌రెడ్డి మధ్య మెజార్టీ ఆధిక్యం చేతులు మారుతూ ఉండడం ఉత్కంఠను కలిగిస్తోంది. మిగిలిన మూడు రౌండ్లలో ఎవరిని విజయలక్ష్మీ వరించనున్నదోనని ఉత్కంఠ నెలకొంది.

రామచంద్రారెడ్డికి ఘన స్వాగతం

కడప అర్బన్ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందిన ఎం.వి. రామచంద్రారెడ్డికి జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేట్ ఉపాధ్యాయులు, యూనియన్ నాయకులు, సాయిబాబా స్కూల్ ఉపాధ్యాయులు, వైసిపి నాయకులు, స్థానికులు ఘన స్వాగతం పలికారు. శుక్రవారం అనంతపురం కలెక్టర్ నుంచి అధికారికంగా ఎన్నిక గెలుపు పత్రాన్ని స్వీకరించిన అనంతరం కడపకు చేరుకున్నారు. **పిఆర్‌టియు హర్షం ..** పశ్చిమ, తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం బలపరిచిన అభ్యర్థులు యం.వి. రామచంద్రా రెడ్డి, పి. చంద్రశేఖర్ రెడ్డి విజయం సాధించడం పట్ల మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, సంఘం రాష్ట్ర అధ్యక్షులు లెక్కల జమాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గురువారెడ్డి, ఆర్థిక కార్యదర్శి ఐలయన్ రెడ్డి, గౌరవాధ్యక్షులు పి.సి. రెడ్డన్న, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.వి. సుబ్బారెడ్డి, ఎన్ని సుబ్బారెడ్డి, ఆర్థిక కార్యదర్శి భోగా వెంకటసుబ్బయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామాంజనేయరెడ్డి, జిల్లా కార్యదర్శి నారాయణరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎం.వి. రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. **పులివెందులలో సన్మానం ..** పశ్చిమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిచిన ఎం. రామచంద్రారెడ్డిని పులివెందుల వైసిపి నాయకులు శుక్రవారం సన్మానించారు. ఆయన పులివెందుల పట్టణంలోని వై.ఎస్. మనోహర్‌రెడ్డి ఇంటికి చేరుకుని కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన విజయానికి పులివెందుల వైసిపి నాయకులు చేసిన మేలును ఎన్నటికీ మరవనని ఆయన అన్నారు. అనంతరం నాయకులు రామచంద్రారెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కౌన్సిలర్ పార్నపల్లె కిషోర్, వెంకటనాథ్‌రెడ్డి, కో ఆప్షన్ చంద్రమౌళి, జెసిఎస్ చంద్రమౌళి, కోడిగుడ్ల సంతోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కడపలో ఘన స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయ సంఘాలు

ప్రతిభా సామర్థ్యాలు పెంపొందించుకోవాలి

విద్యార్థులకు కలెక్టర్ విజయ్ రామరాజు పిలుపు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రస్తుత సమాజంలోని సమస్యలకు తగిన పరిష్కారాలను అన్వేషించి దేశాభివృద్ధికి దోహదపడేలా విద్యార్థులు ప్రతిభా సామర్థ్యాలు పెంపొందించుకోవాలని కలెక్టర్ విజయ్‌రామరాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయి యువజనోత్సవం ఇన్నోవిట్స్-2023 నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్, జెసి సాయి కాంత్‌వర్మ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుతున్న విధివిధానాలకు పటిష్ట ప్రణాళిక అవసరమన్నారు. దానికి అంకితభావం తోడై, సమయ పాలన పాటిస్తే ప్రతి విద్యార్థి అద్భుతాలు చేస్తారన్నారు. ఒక స్పష్టమైన వీక్షణ, నైపుణ్యం, జ్ఞానం, శ్రద్ధ, పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని అని సూచించారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన ఏ .పిచ్చయ్య చౌదరి మాట్లాడుతూ జీవితం పోరాటాల మయమని, విద్య ,ఆరోగ్యం, ఉద్యోగం,వ్యాపారం అన్నింటా పోరాటాలేనని పేర్కొన్నారు. జీవితంలో ప్రతిక్షణం విలువైందని చెప్పారు. సరైన మార్గంలో నడిస్తే జీవితం మనోహరంగా ఉంటుందని సూచించారు. కన్వీనర్ డాక్టర్ ఎమ్.వి.వి.ప్రసాద్ మాట్లాడుతూ వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి వెయ్యి మంది విద్యార్థులు విద్యార్థులు పేపర్ ప్రెసెంటేషన్, టెక్నికల్ క్విజ్, స్పోర్ట్స్ కబడ్డీ , క్రికెట్, వాలీ బాల్ ఖో- ఖో వంటి వివిధ పోటీలలో పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు అనేక స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. వీటిల్లో విద్యార్థులు హ్యాండ్ ప్రింట్, ఫొటోగ్రఫీ, ఫొటో ఫ్రేమ్స్ సెలెక్షన్స్ , టాటూ (పచ్చ బొట్టు) , నవరత్నాలు , చిరు ధాన్యాలు , ఆరోగ్యానికి అనేక రకాల పండ్లు మొదలగునవి ఏర్పాటు చేశారు. అనంతరం ప్రతిభ చూపించిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కరెస్పాండంట్ జి. హుస్సేనరెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ .డి . గోవర్ధన్, కన్వీనర్ డాక్టర్ ఎమ్.వి.వి.ప్రసాద్, హెచ్ఒడిలు కె.రామ మోహన రెడ్డి, డాక్టర్ ఎస్.సిద్దేశ్వర రెడ్డి, వి.నరసింహ స్వామి అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థికి బహుమతి ప్రదానం చేస్తున్న కలెక్టర్, జెసి

బడ్జెట్‌లో ఉపాధి ఊసే లేదు

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో డబ్బు, దౌర్జన్యాలు, బోగస్ ఓట్లు ప్రభావితం చేశాయి
- ప్రతిపక్షాలను నిర్మూలించే బిజెపి ఎత్తుగడలే వైసిపి అనుసరిస్తోంది
- సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

ప్రజాశక్తి - కడప అర్బన్

2023-24 రాష్ట్ర బడ్జెట్‌లో బడ్జెట్‌లో ఉపాధి ఊసే లేదని, వ్యవసాయ రంగాన్ని గాలికి వదిలేశారని, సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌కు ముందు ముఖ్యమంత్రి ఈ బడ్జెట్ సమ్మిళిత, సుస్థిరత, సుపరిపాలన బడ్జెట్‌గా పెట్టబోతున్నట్లు మాటల గారడీలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారని విమర్శించారు. ఈ బడ్జెట్‌లో గ్రామీణ ప్రాంతాల్లో జీవించే 62 శాతం ప్రజలను విస్మరించిందని చెప్పారు. ఉపాధి, వ్యవసాయం, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, ప్రాజెక్టులు, చెరువులు, పంట కాలవలు, పాడి పరిశ్రమ లాంటి ఉత్పాదకరంగాన్ని, ఉపాధి రంగాన్ని పూర్తిగా నిధులు కేటాయించకుండా ఈ బడ్జెట్ విస్మరించిందని తెలిపారు. ఉత్పాదకరంగానికి కేవలం రూ.30 వేల కోట్లు మాత్రమే బడ్జెట్లో చూపించారని, గత బడ్జెట్‌లోనూ రూ.32 వేల కోట్లు చూపించి రూ.16 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసి, మిగతా డబ్బు నగదు బదిలీ అవసరాలకు ప్రభుత్వం వాడుకుందని తెలిపారు. అందుకే రాష్ట్రంలో 'జాబ్ క్యాలెండర్' విడుదల చేయలేకపోయారని, ప్రజల జీవన ప్రమాణాలు పెంచలేకపోయారని గుర్తు చేశారు. ఈ బడ్జెట్ కూడా రాష్ట్రంలో కొత్త ఉపాధి అవకాశాలు కల్పించలేదన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో డబ్బు దౌర్జన్యం బోగస్ ఓట్లు ప్రభావితం చేశాయని పేర్కొన్నారు. ప్రతిపక్షాలను నిర్మూలించే బిజెపి ఎత్తుగడను వైసిపి అనుసరిస్తుందని విమర్శించారు. సార్వత్రిక ఎన్నికలలో తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఐ.ఎన్. సుబ్బమ్మ, బి.మనోహర్, ఎ.రామ్మోహన్, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాసులు రెడ్డి, బి.దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విసి రంగ జనార్ధన్

తెలుగువారు గర్వించదగ్గ రచయిత్రి మొల్ల

- వైవీయూ విసి ఆచార్య జింక రంగ జనార్ధన్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఏడు వందల ఏళ్ల కిందటే రామాయణాన్ని తెలుగు వారందరికి అర్థమయ్యేలా రచించిన కవయిత్రి మొల్ల మన జిల్లా వాసి కావడం మనందరికీ గర్వకారణమని యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య రంగ జనార్ధన్ అన్నారు. శుక్రవారం యోగి వేమన విశ్వవిద్యాలయం, మొల్ల సాహితీపీఠం సంయుక్త ఆధ్వర్యంలో కవయిత్రి మొల్ల సప్తశత జయంతి సభ ఆర్ట్స్ బ్లాక్ సెమినార్ హాల్‌లో నిర్వహించారు. తెలుగు శాఖ ఆచార్యులు డాక్టర్ ఎన్.ఈశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథిగా విసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవయిత్రి మొల్ల రచించిన రామాయణం సుకుమార సరళ రచనగా అభివర్ణించారు. ప్రతి ఏటా మొల్ల జయంతిని విశ్వవిద్యాలయం అధికారికంగా నిర్వహిస్తుందని ప్రకటించారు. మొల్ల రచనలు సాహిత్యం గురించి తెలుసుకోవడంతో పాటు ప్రజల వద్దకు తీసుకెళ్లాలన్నారు. ప్రత్యేక అతిథిగా హాజరైన కుల సచివులు ఆచార్య వైపి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మొల్ల జయంతికి నిధులు ఇచ్చే అధికారికంగా నిర్వహించారని తెలిపారు. సహజంగా ఇతిహాసాలలో భక్తి , కారుణ్య రసం కనిపిస్తుందని, మొల్ల రామాయణంలో నవరసాలు కనిపిస్తాయని తెలిపారు. 24 వేల శ్లోకాల రామాయణం 845 కంద పద్యాలతో వర్ణించిన తీరు అద్భుతం అన్నారు. మొల్ల సాహితీ పీఠం వ్యవస్థాపకులు గానుగపెంట హనుమంతరావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం కవయిత్రి మొల్ల జయంతిని అధికారికంగా నిర్వహించ తలపెట్టడం పట్ల వైవీయూ విసికి, రిజిస్ట్రార్లకు కృతజ్ఞతలు తెలియజేశారు. మొల్ల పేరుతో ఒక సమావేశ మందిరం ప్రారంభించడం ముదావహమన్నారు. కవయిత్రి మొల్ల పేరును నిత్యం గుర్తుంచుకునేలా యోగి వేమన విశ్వవిద్యాలయం ఆర్ట్స్ బ్లాక్‌లో సమావేశ మందిరాన్ని ఉపకులపతి ఆచార్య రంగ జనార్ధన్, కుల సచివులు ఆచార్య వైపి వెంకటసుబ్బయ్యతో కలిసి ప్రారంభించారు. సమావేశంలో ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలో ఒకరు డీబార్

కడప అర్బన్ : రాయచోటిలోని ఓ పరీక్షా కేంద్రంలో ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లీష్ పరీక్ష రాస్తున్న విద్యార్థిని డీబార్ అయ్యారు. పరీక్షకు 23,856 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 22,802 మంది హాజరయ్యారు. 1,054 మంది గైర్హాజరయ్యారు. రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు నుంచి పరిశీలకులుగా రవిశంకర్ నాయక్, ఆర్ ఐ ఓ రమణ రాజు పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించారు.

ఫుడ్ కోర్టుకు సీల్డ్ టెండర్లు ఆహ్వానం : ఎస్‌పి

కడప అర్బన్ : జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో 2018 నుంచి నిర్వహిస్తున్న అమృత్ ఫుడ్ కోర్టుకు సంబంధించి సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌పి అన్బురాజన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫుడ్‌కోర్టును పోలీస్ లైన్‌లోని పెట్రోల్ బంక్ కుడి పక్కన ఉన్న జిల్లా పోలీస్ శాఖకు చెందిన ఖాళీ స్థలంలోకి మార్చామన్నారు. సదరు ఖాళీ స్థలంలో వారే స్వయంగా అభివృద్ధి చేసుకుని నెలవారీ అద్దె ప్రాతిపదికన అమృత్‌ఫుడ్ కోర్టును ఏర్పాటు చేసుకుని నడుపుకోవాలని తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి 2024, మార్చి 31 వరకు అవగాహన ఒప్పందం కోసం ఆసక్తి కలిగిన వారు టెండర్లలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఈనెల 18 ఉదయం 10 గంటల నుంచి 23వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నగరంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన టెండర్ బాక్స్‌లో తమ సీల్డ్ టెండర్లను దాఖలు చేయవచ్చని పేర్కొన్నారు.

ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

- రాష్ట్రంలో సైకో పాలన నడుస్తోంది
- ఎమ్మెల్సీల గెలుపుతో వైసిపికి రోజులు దగ్గరపడ్డాయి
- పాదయాత్రలో నారా లోకేష్



బహిరంగ సభలో మాట్లాడుతున్న నారా లోకేష్

ప్రజాశక్తి-ములకలచెరువు

వైసిపి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలతో విసిగి వేసారి పోతున్న రాష్ట్ర ప్రజలు ప్రభుత్వంపై పూర్తిస్థాయిలో వ్యతిరేకత చూపుతున్నారని, రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సైకోలా వ్యవహరిస్తున్నారని, ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలలో టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపుతోనే వైసిపికి రోజులు దగ్గరపడ్డాయని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 45వ రోజుకు చేరుకుంది. శుక్రవారం అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం బి.కొత్తకోట మండలం నుంచి మొలకలచెరువు మండలంలోని కమ్మపల్లి నుంచి ప్రారంభమైన పాదయాత్ర పులికల్లు, ములకలచెరువు వరకూ పాదయాత్ర సాగుగింది. ఆయా ప్రాంతాల్లో స్థానికులతో మాటామంతి నిర్వహించారు. పాదయాత్ర సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజల్లో చైతన్యం నింపేందుకే కుప్పం నియోజకవర్గంలో పాదయాత్ర మొదలుపెట్టి అన్ని నియోజకవర్గాలలో పర్యటిస్తూ నాలుగువేల కిలోమీటర్లు యువగళం పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి పీఠం కోసం ప్రజలకు ఎన్నో అబద్ధపు వాగ్దానాలు చేసిన జగన్మోహన్ రెడ్డి, ముఖ్యమంత్రి అయ్యాక వాటిని పక్కన పెట్టి ప్రజలను మోసం చేశారన్నారు. ప్రజలకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం, రాష్ట్రంలో తాళిబన్‌ల పరిపాలన కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ లకు ఉన్న కార్పొరేషన్లు పూర్తిగా తొలగించి వారికి అన్యాయం చేయడం జరిగిందన్నారు. 45 సంవత్సరాలు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ నిరుపేదలకు పింఛన్ సరఫరా చేస్తానని హామీ ఇచ్చి ఇంతవరకు పట్టించుకోలేదన్నారు. ఉన్న పాఠశాలలను కూడా మూసివేస్తూ, విదేశీ విద్య కూడా రద్దు చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికి దక్కిందన్నారు. రాయలసీమ బిడ్డనని చెప్పుకునే జగన్మోహన్‌రెడ్డి హంద్రీ-నీవా, గాలేరు కాలువ పనులను ఇంతవరకు పూర్తి చేయలేక ప్రజలను ఇబ్బందులు పాలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తానని, ఎందుకు సంబం ధించి ప్రతి సంవత్సరం ఉద్యోగాల క్యాలెండర్ ను విడుదల చేస్తానని రాష్ట్రంలోని నిరుద్యోగులను నమ్మించి, నాలుగు సంవత్సరాలు అయినా నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. ఉన్న పరిశ్రమలను పక్క రాష్ట్రాలకు తరిమికొడుతూ రాష్ట్రంలో మరింత నిరుద్యోగత పెంచుతూ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తున్నారన్నారు. ప్రజల ధనాన్ని దోచుకుంటూ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి తీసుకెళ్లారన్నారు. తంబళ్లపల్లి నియోజకవర్గంలో కురబలకోట, అంగళ్లు ప్రాంతంలో పోలీసులను అడ్డుపెట్టుకొని ప్రభుత్వ భూములు వందల ఎకరాలు, వేలకోట్ల రూపాయలు విలువచేసే ప్రభుత్వం భూములను ఆక్రమించుకు న్నారన్నారు. తంబళ్లపల్లి మల్లయ్య కొండ దేవాలయంలో ఉన్న మూల విగ్రహాన్ని ఏం చేశారు, అది ఎక్కడుంది అని ప్రశ్నించారు. అన్ని హంగులున్న మదనపల్లి ని జిల్లా కేంద్రంగా ప్రకటించాల్సి ఉండగా పెద్దిరెడ్డి కుటుంబం స్వలాభం కోసం, మారు మూలున్న రాయచోటిని జిల్లా కేంద్రంలోకి మళ్లించారన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే జిల్లా కేంద్రంగా చేస్తామని హామీ ఇచ్చారు. పాలు విసిరిన సవాల్ పై ఎప్పుడైనా ఎక్కడైనా చర్చకు సిద్ధమేనన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే హంద్రీనీవా పనులు పూర్తి చేస్తామని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, మదన పల్లి టమోటా మార్కెట్‌ను దత్తత తీసుకొని, మార్కెట్ను అభివృద్ధి చేస్తానని తెలిపారు. అరాచక పాలన సాగిస్తున్న వైసిని గద్దదించాలని ప్రజ లను కోరారు. తెలుగుదేశం పార్టీ శ్రేణులు రాబోయే రోజుల్లో పార్టీ గెలుపు కోసం, భయపడకుండా శ్రమించి పార్టీని గెలిపించాలని కోరారు. అనంతరం ముల కలచెరువు నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లాలోని చీకటిమానపల్లి మీదుగా పాదయాత్ర కొనసాగించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్, టిడిపి పార్టీ నాయకులు గంటా నరహరి, కొల్లు రవీంద్ర, బీసీ సెల్ రాష్ట్ర నాయకులు గుత్తికొండ త్యాగరాజు, రాష్ట్ర తెలుగు మహిళా నాయకులు పర్వీన్‌తాజ్, జడ్పిటిసి కువైట్ శంకర్, మండల అధ్యక్షులు సిద్ధప్ప, ఉపాధ్యక్షులు వెంకటస్వామి, కెవి రమణ, మౌలా, భజంత్రీ రామానుజులు, కేశవులు, చిన్న కృష్ణ, కట్టహరి, నరసింహారెడ్డి, సుబ్బి నాయుడు, విజయ్ కుమార్, రెడ్డప్ప, శ్రీనివాసులు, సోము, గంగాదేవి పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు నీరు కలేనా!

ప్రజాశక్తి - చాపాడు



పంట కాలువలో ప్రవహిస్తున్న డ్రెయినేజీ నీరు

చాపాడు చానల్ పరిధిలోని కెసి చివరి ఆయకట్టుకు నీరు ప్రవహించడం కలగా మారుతుంది. చివరి ఆయకట్టుకు సాగునీరు అందించేలా సిమెంట్ లైనింగ్ కాలువలు ఏర్పాటు చేసినా ఉపయోగం లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. ఈ కాలువ పరిధిలో ఖాదర్ పల్లె, చాపాడు, సీతారామపురం గ్రామాల పరిధిలో 6వందల ఎకరాలకు పైగా సాగు పొలం ఉంది. కాలువకు నీరు రాకపోవడంతో రైతులు ఇతర ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఖాదర్ పల్లి, చాపాడు గ్రామాలలో ఉన్న కెసి కెనాల్ కాలువలో గృహ అవసరాలకు వినియోగించిన డ్రెయినేజీ నీరు అనుసంధానం చేయడం వల్ల కాలువ పూర్తిగా వ్యర్థ పదార్థాలతో నిండి ఉంది. దీంతో కెసి నీరు కాలువలో ప్రవహించే అవకాశం లేదు. ప్రస్తుతం చాపాడు కెసి కాలువకు నీరు విడుదలవుతున్నా చివరి ఆయకట్టుకు సాగునీరు రావడం లేదు. కొన్ని సంవత్సరాలుగా ఇదే పరిస్థితి. డ్రెయినేజీని తొలగించి కాలువలో పూడికతీత పనులు చేపడితే సాగు నీరు ప్రవహించడానికి అవకాశం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. కెసి కాలువ లైనింగ్ ఏర్పాటు చేసినా గ్రామం మధ్యలో ఉండడంతో ప్రజలు ఇష్టానుసారంగా డ్రెయినేజీకి అనుసంధానం చేశారు. ఫలితంగా చెత్తాచెదారంతో నిండి పోయింది. పూడికతీత పనులకు ఉపాధి కూలీలు వచ్చేందుకు అయిష్టత చూపుతున్నారు. కొనేళ్లుగా పూడికతీత పనులు కూడా చేపట్ట లేదు. పంచాయతీ సిబ్బంది గృహ అవసరాలకు వినియోగించిన నీటిని కాలువలోకి రాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. డ్రెయినేజీ నీరు కాలువలోకి రాకుండా చూసి అనంతరం పూడికతీత చేపడితే పంట కాలువ ఉపయోగంలోకి వస్తుంది. లేదంటే ఈ పంట కాలువ పూర్తిగా డ్రెయినేజీ కాలువగా రూపాంతరం చెందుతుంది.



విద్యార్థులతో ముచ్చటిస్తున్న డిఇఒ రాఘవరెడ్డి

డిఇఒగా రాఘవరెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా విద్యాశాఖ అధికారిగా ఎద్దుల రాఘవరెడ్డి శుక్రవారం బాధ్యత స్వీకరించారు. 1999 జూన్‌లో కర్నూల్ ఐఎఎస్ఇ ఇన్‌స్టిట్యూట్‌ఆఫ్ అడ్వాన్స్ స్టడీ ఇన్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్‌గా విధుల్లో చేరారు. అదే ఏడాది ఎస్‌సిఇఆర్‌టిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బదిలీపై విధులు నిర్వహించారు. 2013లో కర్నూల్ డైట్ ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టారు. 2017లో ఐఎఎస్ఇ ప్రిన్సిపల్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ 2019లో కమిషన్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో ఐటి శాఖ డిడి విధులు నిర్వహించారు. 2022 ఏప్రిల్‌లో అన్నమయ్య జిల్లా డిఇఒ విధులు చేపట్టారు. అక్కడి నుంచి బదిలీపై రెగ్యులర్ డిఇఒ కడప జిల్లాలో బాధ్యతలు స్వీకరించారు. **'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి**..జిల్లాలో అన్ని పాఠశాలలో యాజమాన్యంలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎద్దుల రాఘవరెడ్డి ఆదేశించారు. శుక్రవారం నగరంలోని నగరపాలక ఉన్నత పాఠశాల మెయిన్, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల జయనగర కాలనీ, నగరపాలక ఉన్నత పాఠశాల గాంధీనగర్ పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో తరగతి గదిలో పర్యవేక్షించి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్క ఉపాధ్యాయుడూ లెసన్ ప్లాన్ తప్పనిసరిగా రాయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కడప మండల విద్యాశాఖ అధికారి పాలెం నారాయణ పాల్గొన్నారు.

వైవీయూ, జెఎన్‌టియు మధ్య అవగాహన ఒప్పందం

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప యోగి వేమన విశ్వవిద్యాలయం, అనంతపురం జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్శిటీ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. యోగివేమన విశ్వవిద్యాలయ విసి ఆచార్య రంగ జనార్ధన్ సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య వెంకటసుబ్బయ్య, జెఎన్‌టియు కుల సచివులు ఆచార్య సి శశిధర్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి మార్చుకున్నారు. ఈ సందర్భంగా విసి ఆచార్య రంగ జనార్ధన్ మాట్లాడుతూ భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఎన్విరాన్మెంటల్ ఫారెస్ట్ అండ్ క్లైమేట్ చేంజ్ వారిచే దేశంలోనే 17వ లీడ్ బొటానికల్ గార్డెన్‌గా పేరుపొందిన యోగి వేమన విశ్వవిద్యాలయం బొటానికల్ గార్డెన్ , అనంతపురం జేఎన్టీయూ విశ్వవిద్యాలయం విద్యార్థులు, అధ్యాపకుల పరిశోధన కార్యకలాపాలు, రెండుసంస్థల మధ్య సాంకేతిక పరిజ్ఞానం మార్పిడికి ఈ ఒప్పందం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వైవీయూ లీడ్ బొటానికల్ గార్డెన్ బాధ్యులు ఆచార్య ఎ. మధుసూదన్‌రెడ్డి, ప్రొద్దుటూరు వైవీయూ వైఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రధాన ఆచార్యులు ఆచార్య నాగరాజు, వైవీయూ పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి. శ్రీనివాస్, రహదారి భవనాల విశ్రాంత ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చంద్రశేఖర్ రెడ్డి, జెఎన్‌టియు ఇంజినీర్ అస్లాం బాషా, రమణ, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్. ఈశ్వర్ రెడ్డి, ప్రజా సంబంధాల విభాగ సంచాలకులు డాక్టర్ ఎస్.వి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలు స్వీకరిస్తున్న విసి


డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారం

డ్రెయినేజీలో చెత్తాచెదారం

స్తంభించిన మురుగు నీరు - అధికమవుతోన్న దోమలు

ప్రజాశక్తి -ఖాజీపేట

ప్రభుత్వం పారిశుధ్య నిర్వహణ కోసం లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన మురుగు కాలువలు అధ్వానంగా మారాయి. కాల్వలు చెత్త, చెదారంతో నిండిపోవడంతో మురుగునీరు ఎటూ వెళ్లలేక స్తంభించి పోయింది. దీంతో పట్టపగే దోమలు అధికమై ఇళ్లల్లోకి ప్రవేశించి అనారోగ్యానికి గురిచేస్తున్నాయి. అయినప్పటికీ పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం శోచనీయం. మురుగు కాల్వలు అస్తవ్యస్తంగా ఉండడంతో దుర్వాసనతో అల్లాడుతున్నామని, పైగా దోమల బెడద అధికంగా ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. డ్రెయినేజీలో పూడిక తీత పనులు చేపట్టాలని కోరుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. మండల పరిధిలోని చెమల్లపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద మురుగు కాల్వలు పూడికతో నిండిపోయాయి. ఖాజీపేటలోని సొసైటీ కాలనీ, బిసి కాలనీ, ముస్లిమ్ కాలనీల్లో కాల్వలు అస్తవ్యస్తంగా మారాయి. దీంతో రోజూ సాయంత్రమైతే దోమలు అధికమై రోగాల భారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధితాధికారులు స్పందించి కాల్వలు శుభ్రపరిచి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న మానిటరింగ్ అధికారి

విద్యా బోధనపై ప్రణాళికలు సిద్ధం చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ఉపాధ్యాయులు విద్యా బోధనపై ప్రణాళికలు సిద్ధం చేసుకొని విద్యార్థులకు పాఠాలు చెప్పాలని మానిటరింగ్ అధికారి చెరుకూరి శ్రీనివాసులు కోరారు. శుక్రవారం వేంపల్లెలోని బాలికల ఉన్నత పాఠశాలలో లిప్ కార్యక్రమంపై మానిటరింగ్ అధికారి చెరుకూరి శ్రీనివాసులు తనిఖీ చేశారు. 6,7,8 తరగతులకు చెందిన లెసన్ ప్లానింగ్, కే స్టడీ, ప్రాక్టీసు పీరియడ్ వాటిపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఉపాధ్యాయుడూ లిప్‌పై తప్పనిసరిగా దృష్టి పెట్టాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులు చదువులో ముందు వరుసలో ఉండే విధంగా చేయడమే లక్ష్యంగా పని చేయాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, దిశగా ప్రతి ఉపాధ్యాయుడూ కృషి చేయాలన్నారు.



డాక్టరేట్ అందుకుంటున్న యాదాటి సోదరులు

యాదాటి సోదరులకు గౌరవ డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పసరు వైద్య సేవలకు గుర్తుగా పులివెందుల పట్టణానికి చెందిన యాదాటి సోదరులకు అరుదైన గౌరవం లభించింది. వీరి సేవలను గుర్తించి ఢిల్లీకి చెందిన మ్యాజిక్, ఆర్ట్ యూనివర్సిటీ వారి పర్యవేక్షణలో మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్ వారి ఆధ్వర్యంలో యాదాటి సోదరులైన రామ గంగాధర్ రెడ్డి యాదవ్, గ్రామ రెవెన్యూ అధికారి, యాదాటి వివేకానందరెడ్డి యాదవ్‌ను ఢిల్లీలో గురువారం సాయంత్రం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. కరోనా మొదటి సమయంలో అన్నదమ్ములిద్దరు లక్షలాది మందికి ఉచితంగా నాటు ఆకు పసరుతో వైద్యం అందించారు. వివిధ దీర్ఘకాలిక వ్యాధులకు నిత్యం ఆకు పసరు వైద్యం చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా మహమ్మారి మన దేశానికి వచ్చినప్పుడు ఉచితంగా ప్రజలకు సేవ చేశామని చెప్పారు. అరుదైన గౌరవం దక్కడం సంతోషకరమని పేర్కొన్నారు.

చిరుధాన్యాలు తిందాం.. ఆరోగ్యంగా ఉందాం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

చిరుధాన్యాలు తిందాం.. చిరకాల ఆరోగ్యంగా ఉందాం అని ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతికకళాశాల ప్రిన్సిపల్ సర్దార్ బేగ్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవం సందర్భంగా పట్టణంలో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. చిరు ధాన్యాలు తిందాం - చిరకాలం ఆరోగ్యం గా ఉందాం, సిరి ధాన్యాలే - చిరు ధాన్యాలు వంటి నినాదాలు చేశారు. కార్యక్ర మంలో డాక్టర్ ఏడుకొండలు, అరుణ, రాజశేఖర్, రామిరెడ్డి, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, నేత్రనిధి టెక్నీషియన్ హరీష్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని ఎరువుల దుకాణాలను శుక్రవారం బద్వేల్ వ్యవసాయ శాఖ ఎడిఎ నాగరాజు ఎఒ మ్యాగీతో కలిసి తనిఖీ చేశారు. ఎరువుల దుకాణాల్లోనిల్వ, అమ్మకం, ధరలు నమోదు చేసిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే ఎరువులను రైతులకు విక్రయించాలన్నారు. డిపిఎ ఎరువులు ప్రయివేట్ దుకాణాలలో, సచివాలయాలలో అందుబాటులో ఉందన్నారు. కృత్రిమ కొరత కల్పించినా, అధిక ధరలకు విక్రయించినా లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులు కూడా దుకాణదారుల వద్ద రసీదులను తప్పక పొందాలన్నారు. డిఎపి స్థానంలో కృత్రిమ ఎరువులు వినియోగించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఎరువులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

పసుపు రైతుల్లో గుబులు

- అకాల వర్షంతో తడిసిన పసుపు కొమ్ములు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో శుక్రవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షంతో పసుపు రైతుల్లో ఆందోళన మొదలైంది. దుక్కులు పూర్తయిన రైతులు ఉడకబెట్టడం ప్రారంభించారు. అకాల వర్షంతో ఉడికించిన పసుపు తడవడంతో దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో వర్షం ప్రారంభం కావడంతో ప్లాస్టిక్ పట్టలను వేసేందుకు కూడా అవకాశం లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. పెద్దగాలులు వీయడంతో వర్షానికి తడవకుండా కాపాడలేకపోయారు. రెండు, మూడు రోజులపాటు తిరిగి వర్షం పడితే పసుపుకొమ్ములు ఏమాత్రం పనికి రావని రైతులు వాపోతున్నారు. తడిసిన పసుపు కొమ్ములను ఆర పెట్టుకొనే ప్రయత్నాలు రైతులు ప్రారంభించారు. మండల పరిధిలోని విశ్వనాథపురం, కేతవరం, చాపాడు, అల్లాడుపల్లె, సీతారామపురం గ్రామాల పరిధిలో పసుపు ఉడికించి ఆరబెడుతున్నారు. రోజూ ఎక్కువగా ఎండ పెడుతూ ఒక్కసారిగా వర్షం రావడంతో రైతులు ఆరబెట్టిన పసుపును తడవకుండా జాగ్రత్త పడలేక పోయారు. మండల పరిధిలో పసుపు పంటతో పాటు దోస, వరి, నూగు పంటలు కూడా సాగులో ఉన్నాయి. తిరిగి వర్షం పడితే పంటలలో పూత రాలిపోయి దిగుబడి తగ్గే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు.


పసుపు కొమ్ములను వర్షానికి తడవకుండా కప్పిన రైతులు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు



ప్రొద్దుటూరు : ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య

ప్రజాశక్తి - కడప అర్బన్/ప్రొద్దుటూరు

మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం, అధికారులు వెంటనే పరిష్కరించాలని లేని పక్షంలో సమ్మెలోకి వెళ్లేందుకు వెనుకాడమని సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య హెచ్చరించారు. శుక్రవారం ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కల్టెరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని సిఎం జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. హెల్త్ అలవెన్సు కోసం సమ్మె చేస్తే ఇస్తామని చెప్పిన ప్రభుత్వం విస్మరించడం శోచనీయమన్నారు. పారిశుధ్య కార్మికులకు హెల్త్ అలవెన్స్ వేతనంలో కలిపి ఇస్తోందని, ఇంజినీరింగ్ కార్మికులకు ఇవ్వకపోవడం సమంజసం కాదని పేర్కొన్నారు. కార్మికులకు న్యాయం చేయని పక్షంలో సమ్మెలోకు వెళ్లేందుకు వెనుకాడమని హెచ్చరించారు. ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్ మాట్లాడుతూ కార్మికులకు రావాల్సిన పనిముట్లు, రెయిన్‌కోట్స్ వెంటనే ఇవ్వాలని కోరారు. జిఒ నంబరు 7 ప్రకారం కనీస వేతనం రూ.18,500 ఇవ్వాలని చెప్పారు.

ప్రొద్దుటూరు : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కార్మిక సంఘం (సిఐటియు అనుబంధం) నాయకులు కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం మున్సిపల్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్ష కార్యదర్శులు చంటి, సాల్మన్ మాట్లాడుతూ ఐదు రోజుల సమ్మెకాలపు ఒప్పందాల డిమాండ్లను పరిష్కరించాలన్నారు. నేటి ధరలకు అనుగుణంగా కనీసం వేతనం రూ.26 వేలు మంజూరు చేయాలన్నారు. మున్సిపల్ కార్మికులకు ఏపిఎఫ్‌ఆర్ఎస్ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. స్థానిక 1వ డివిజన్ నుంచి నలుగురు కార్మికులను 4వ డివిజన్‌కు పంపించారని వారిని యధావిధిగా 1వ డివిజన్‌లోనే ఉంచాలని పేర్కొన్నారు. కొత్తగా వచ్చిన చెత్త ఆటోల నుండి మహిళాకార్మికులకు మినహాయింపు ఇవ్వాలన్నారు. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఆదివారం పూర్తి సెలవు దినం ఇవ్వాలన్నారు. అనంతరం మున్సిపల్ సహాయ కమిషనర్ రంగస్వామికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కార్మికులు గుర్రమ్మ, రమాదేవి, రవణమ్మ, నీతమ్మ, మోహన్‌జాకోబ్, శాంతి, ప్రమీలమ్మ, నరసమ్మ, సురేష్, అన్నపూర్ణ పాల్గొన్నారు.

వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

మున్సిపల్ పరిధిలోని వడ్డీ చెల్లింపుదారులు వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం జారీ చేసిన జిఒ 34 ప్రకారం వడ్డీ మాఫీ చేసిందన్నారు. మున్సిపల్ పరిధిలోని పన్నుచెల్లింపుదారులు ప్రతి ఆరు మాసాలకోసారి పన్ను చెల్లించాల్సి ఉంటుందన్నారు. భవన విస్తీర్ణం, ప్రాంతాన్ని బట్టి పన్ను విధిస్తారని చెప్పారు. ఇందులో పన్ను సక్రమంగా చెల్లించేవారు, చెల్లించని వారున్నారన్నారు. 1993 నుండి ఇప్పటివరకు చెల్లించని వారి పన్ను అసలు మొత్తం 14.26 కోట్లు ఉందని చెప్పారు. ఇందుకు వడ్డీ రూ.10.72 పడుతుందని చెప్పారు. మొత్తం రూ.24. 98 కోట్లు ప్రొద్దుటూరు పురపాలక సంఘానికి బకాయి ఉందన్నారు. పన్ను చెల్లింపుదారునికి ఆర్థిక వెసులుబాటు కలిగించేందుకు వడ్డీ మాఫీ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బకాయిల జాబితా నుంచి తమ పేర్లను తొలగించుకోవాలని ఆయన కోరారు. పన్నులు సకాలంలో చెల్లిస్తే మున్సిపల్ పరిధిలోని ప్రజలకు సేవలందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. రూ.120 కోట్లతో మైలవరం జలాశయం నుంచి నీటిని సరఫరా చేయడంతో పాటు తాగునీటిని పరిష్కరించుకోవచ్చన్నారు. పట్టణ పరిధిలోని 40వార్డులలో రూ.90 కోట్లతో సిమెంట్ రోడ్లు వేశామన్నారు. ఇలా ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు చేసేందుకు ప్రజలు చెల్లించే పన్ను సహకరిస్తుందన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి



ఆర్టీసీ ప్రాంగణాన్ని శుభ్రం చేసిన విద్యార్థులు


పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం

ప్రజాశక్తి - కడప

మన చుట్టూ ఉన్న పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యాన్ని పరిరక్షించుకుందామని ఆర్ట్స్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ ఆఫీసర్ డాక్టర్ వై. సావిత్రి పిలుపునిచ్చారు. శుక్రవారం యోగి వేమన విశ్వవిద్యాలయం ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎన్. వెంకటరామిరెడ్డి, రీజనల్ జాయింట్ డైరెక్టర్ సంయుక్త ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల విద్యార్థులతో మాసివ్ క్లీనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఆర్టీసీ ప్రాంగణంలోని ప్లాస్టిక్, హానికర వ్యర్థాలను సేకరించి వాటిని మున్సిపాల్టీకి అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వై సావిత్రి విద్యార్థులకు పరిశుభ్రత ప్రాముఖ్యతను వివరించారు. ఆర్టీసీ ఆవరణనాన్ని మొత్తం శుభ్రం చేయడంలో విద్యార్థులు కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యోగివేమన యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్లు డాక్టర్ రాజగోపాల్ రెడ్డి మధు, సుబ్బనరసయ్య, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ ఎ.నాగరాజు, నాగార్జున కళాశాల విద్యార్థులు మహిళా కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

చేనేత యువజన విభాగం ఉపాధ్యక్షులుగా మోడెం రమేష్

ప్రజాశక్తి - కడప



జాతీయ చేనేత ఐక్యవేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులుగా అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం వర్గానికి చెందిన మోడెం రమేష్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జాతీయ చేనేత ఐక్యవేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు సుంకర చిన్న రెడ్డి బాబు తెలిపారు. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తున్నట్లు ఆయన తెలిపారు. జాతీయ చేనేత ఐక్యవేదిక ద్వారా చేనేత కార్మికుల పరిరక్షణ కోసం, వారి సంక్షేమం కోసం మోడేమ్ రమేష్ నిరంతరం కృషి చేస్తారని ఆకాంక్షిస్తూ ఆయనకు హృదయపూర్వక అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు. మోడేమ్ రమేష్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకం ఉంచి రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులుగా బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

రామ్‌గోపాల్ వర్మపై కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

నాగార్జున యూనివర్సిటీలో మహిళలు, విద్యార్థుల పట్ల అవహేళనగా మాట్లాడిన సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ పై సుమోటో కింద కేసు నమోదు చేయాలని, వైస్ ఛాన్సలర్ రాజశేఖర్‌ను వెంటనే భర్త్ రఫ్ చేయాలని పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.అంకన్న డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ లో అకాడమిక్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించడానికి వచ్చిన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ విద్యార్థుల పట్ల, మహిళల పట్ల మాట్లాడిన తీరు చాలా జుగుప్సాకరంగా, అవహేళనగా ఉందని తెలిపారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత యూనివర్సిటీలన్నీ వైసిపి కార్యాలయాల్లా మారాయని విమర్శించారు. కేసు నమోదు చేయకపోతే విద్యార్థి, యువజన, మహిళా, ప్రజా సంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో పిడియస్‌యు నగర నాయకులు తరుణ్, కుమార్, చరణ్, మహేష్ సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

పీజీ సీట్ల అనుమతి కోసం మెడికల్ కౌన్సిల్ పరిశీలన

ప్రజాశక్తి- కడప సిటీ

రిమ్స్ మెడికల్ కళాశాలలో పలు విభాగాలకు చెందిన పీజీ సీట్ల అనుమతి కోసం నేషనల్ మెడికల్ కౌన్సిల్ బృందం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసిందని ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ పేర్కొన్నారు . ఈనెల 15న బయో కెమిస్ట్రీలో 5, మైక్రో బయాలజీలో 9, ఫార్మకాలజీలో 7, ఫోరెన్సిక్ మెడిసిన్‌లో 5, పాథాలజీలో 9, రెస్పిరేటరీ మెడిసినల్‌లో 5, సైకియాట్రిక్‌లో 5 పీజీ సీట్లకు సంబంధించి పరిశీలించారని చెప్పారు. అలాగే శుక్రవారం కమ్యూనిటీ మెడిసిల్‌లో 9, రేడియో డయాగ్నోసిస్‌లో 7, రేడియేషన్ అంకాలజీలో5, వైద్య విభాగంలో ఐదు పీజీ సీట్ల కోసం పరిశీలన చేశారన్నారు. నేషనల్ కౌన్సిల్ నియమావాళికి అనుగుణంగా విభాగాలు ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. వైద్య మండలి పరిశీలనకు ఆయా విభాగాధిపతులు సహకరించారని చెప్పారు. అన్ని విభాగాలకు కేటాయించిన 71 పీజీ సీట్లు వస్తాయని సీట్లు వస్తాయని, తద్వారా పేదలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.


రిమ్స్ కళాశాలో పరిశీలన బృందం


వీధుల్లో సంచరిస్తున్న కుక్కలు

బాబోయ్ కుక్కలు

- భయాందోళనలో ప్రజలు

ప్రజాశక్తి-లింగాల

మండల కేంద్రమైన లింగాలలో రహదారిపై నడవాలంటే హడలిపోతున్నారు. ఎందుకంటే ఎటు చూసినా కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేయడమేగాక దాడి కూడా చేస్తున్నాయి. ఏమాత్రం ఏమరపాటుగా ఉంటే వాటి కాటుకు గురికావాల్సిందే. నిత్యం విద్యార్థులు, మహిళలు రాకపోకలు సాగించే ప్రధాన కూడళ్లలో సైతం కక్కులు సంచరిస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా తిరుగుతుండడంతో స్థానికులు రహదారిపై రాకపోకలు సాగించాలంటే భయపడుతున్నారు. ద్విచక్ర వాహనంపై వెళ్లే వారిపై అమాంతంగా వచ్చి గాయపరుస్తున్నాయి. శుక్రవారం మండల కేంద్రంలోని జడ్‌పి హైస్కూల్ వద్ద రవికుమార్‌రెడ్డి అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఓ కుక్క అతని తొడభాగం వద్ద గాయపడిరింది. కొన్ని కుక్కలు ద్విచక్రవాహలను మొరుగుతూ వెంబడించడంతో అదుపు తప్పి కిందపడి గాయాలపాలయ్యారు. గొర్రెలు, మేకలు, ఆవు, దూడలపైనా దాడి చేస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కలను బెడద నుంచి తమను రక్షించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపిడిఒ స్పందిస్తూ వచ్చే వారంలోగా మున్సిపల్ సిబ్బందితో కుక్కలను ఊరికి దూరంగా కొండల్లో వదిలిపెడతామని చెప్పారు.

ఆరు నెలలుగా ఆగిన చోటే వాహనం

ప్రజాశక్తి-కొండాపురం


జాతీయ రహదారిపై నిలబడి ఉన్న వాహనం

మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన ఆరు నెలలుగా ఓ భారి వాహనం ఆగింది. తీసుకెళ్లడానికి దాని యజమాని కూడా రాకపోవడం శోచనీయం. వాహనం ఆగి ఉండడం వల్ల స్థానికులకు అసౌకర్యంగా మారింది. ఆరునెలల కిందట వాహనం చెడిపోవడంతో సంబంధిత యజమాని అక్కడే వదిలేశాడు. జాతీయ రహదారి పక్కనే ఉండడంతో రాత్రిపూట ఇతర వాహనాలు రాకపోకల సమయంలో ప్రమాదాలకు గురవుతున్నాయి. స్థానికులు వాహన యజమానికి ఫోన్ ద్వారా సమాచారం అందించినా రేపు, మాపు అంటూ కాలం వెలిబుచుతున్నాడు. భారీ వాహనం ఆగి ఉండడం వల్ల తమకు అసౌకర్యంగా ఉందని స్థానిక వ్యాపారులు పేర్కొంటున్నారు. కొందరు మద్యం సేవించి బాటిళ్లను వాహనం సమీపంలో పడేయడంతో చుట్టుపక్కల ఉన్న వారికి ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా పోలీసులు స్పందించి భారీ వాహనానికి అక్కడి నుంచి తరలించే ప్రయత్నం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రజాశక్తి పులివెందుల రూరల్

ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని ఆర్టీసీ డిఎం ఉమామహేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పులివెందుల ఆర్టీసీ నూతన డిపోలో డిఎం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్ షరీఫ్ సొంత నిధులతో వివిధ రకాల మొక్కలను తీసుకురావడం సంతోషకరమన్నారు. మొక్కలు నాటడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉంటాయన్నారు. వాటి పరిరక్షణ కూడా మనం చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కులాయప్ప, సూర్యనారాయణ, గోపాల్ రెడ్డి, కులాయప్ప, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.



కాన్వకేషన్ అందుకున్న చిన్నారులతో చైర్మన్, డైరెక్టర్

ఘనంగా నాగార్జున మోడల్ స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని మారుతీ నగర్‌లో ఉన్న నాగార్జున మోడల్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యా సంసల చైర్మన్ ఎం. శివ శంకర్ రెడ్డి, డైరెక్టర్ శ్రీదేవి జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రీ ప్రైమరీ స్కూల్లో కిండర్ గార్డెన్ పూర్తి చేసిన చిన్నారులకు కాన్వకేషన్ పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ చిన్నారులు ఒత్తిడికిలోను కాకుండా ఆడుతూ, పాడుతూ ఉత్సాహంగా నేర్చుకునే విధంగా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి అనువైన వసతి కల్పిస్తూ, ఆధునిక సాంకేతికతతో బోధన పద్ధతులను అనుసరిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు శాయశక్తుల ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు, నాటికలు, జోక్స్ ఆహుతులను ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో మోడల్ స్కూల్ డీన్ కులాయప్ప, ప్రిన్సిపల్ కృష్ణవేణి, విద్యార్థులు తల్లిదండ్రులు, వివిధ పాఠశాలల యాజమాన్యం నగర ప్రముఖులు శ్రేయోభిలాషులు హాజరయ్యారు.

కృత్రిమ గర్భధారణ కేంద్రాలు రిజిస్టర్ చేసుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలు నిర్వహిస్తున్న ఎఆర్‌టి, సరోగసి కృత్రిమ గర్భధారణ కేంద్రాల యాజమాన్యాలు ఈనెల 31లోగా రిజిస్టర్ చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కె.నాగరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెబ్‌సైట్‌లో దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకుని ప్రభుత్వం నిర్ణయించిన రుసుంను డిడి ద్వారా చెల్లించాలని తెలిపారు. రిజిస్టర్ చేసుకోకుండా వైద్య సేవలు కొనసాగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

నేడు జాబ్‌మేళా

ప్రజాశక్తి-ప్రొద్దుటూరుటౌన్

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ చంద్రశేఖర్, జెకెసి కో-ఆర్డినేటర్ శశికాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాబమేళాలో డిగ్రీ, ఇంటర్, ఐటిఐ ఉత్తీర్ణులైన 19 నుంచి 27 ఏళ్ల వయస్సు కల్గిన పురుష అభ్యర్థులు అర్హులన్నారు. నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.